దేనికోసం దేవులాట?

మాలతిని మరువలేను అందమైన ఆమె ముఖం, మధురమైన ఆమె కంఠం, మెరిసే ఆకళ్లూ, నన్ను వెంటాడుతున్నాయి మైమరపించే ఆమె చిరునవ్వునీ, నవ్వుతూ ఉంటే బయల్పడే ముత్యాల పలువరుసనీ మరవడం నావల్ల కాదు సళాకులాంటి ఆమె శరీరం, ఆమె వయ్యారపు నడకా ఎప్పుడూ నా కళ్ళముందు మెదుల్తూ ఉంటాయి పెళ్ళయినవాడినై ఉండి కూడా పరస్త్రీని ధ్యానిస్తూ ఉండడం ద్వారా నా భార్య అయిన శకుంతలకు అన్యాయం చేస్తున్నానేమో అనిపిస్తున్నది అయినా ఏమి చేయడం? ఎంత ప్రయత్నించినప్పటికీ మాలతి సౌందర్య చిత్రాన్ని నా మనః ఫలకం నుంచి తుడిచివేయ లేకుండా ఉన్నాను దానికి కారణం మాలతిని ప్రేమిస్తున్నాననే నా గట్టి నమ్మకం కావడమే అయి ఉంటుంది

భర్తగా నా విధులను నేను మరువలేదు ఆమెకు కావలసిన వస్తువు లన్నీ కొంటున్నాను, సినిమాలకూ, నాటకాలకూ తీసుకొని వెళ్ళుతున్నాను. ఏ మాత్రం తీరుబడి ఉన్నా ఆమె సమక్షంలోనే గడుపుతున్నాను నేను సరిగా చూడలేదని ఎవరూ అనలేరు, శకుంతలతో సహా కాని నా మట్టుకు నేను ఉన్న సంగతి చెప్పాలంటే — శకుంతల ఏమనుకున్నా సరే — నా సర్వస్వం ఆమెకు నేను ఇవ్వడం లేదు మాలతిని గురించిన మథన నన్ను చాలవరకు వేధిస్తోంది

ప్రస్తుతం నేను విశాఖపట్టణంలో ఒక కంపెనీలో సేల్సు మానేజరుగా పని చేస్తున్నాను నే నా కంపెనీలో ఒక గుమాస్తాగా చేరి వృద్ధిలోకి వచ్చాను నా సర్వీ సంతటిలోను మాలతి ఎక్కడుందో నని వెతుకుతూనే ఉన్నాను పదేళ్ళయినది ఆమెను చూసి కొద్ది రోజుల క్రితం మాలతి తన భర్తతో మదరాసులో ఉందని ఒక పాత నేస్తం చెప్పాడు చివరకు నా మాలతిని చూచే అవకాశం చిక్కింది : ఏమన్నానూ, 'నా మాలతి'

వి వి యస్ రామదాసు

అనా? అయితే పొరపాటే. వివాహితుడినై ఉండి కూడా ఇంకొకరి భార్యను గురించి ఆవిధముగా అనకూడదు. ఏమయినా, పట్టినే ఒకసారి ఆమెను చూడడంలో హాని ఏమీ లేదనుకున్నాను.

మదరాసుకి మా కంపెనీ పనిమీద వెళ్ళే వీలుకోసం కాచుకు కూర్చున్నాను. వచ్చిన మొదటి అవకాశాన్ని వినియోగించుకున్నాను. పాపం, కేవలం ఉద్యోగధర్మం రీత్యానే మదరాసుకి వెళుతున్నా నని శకుంతల అనుకున్నట్లుంది. కాని ఇదిగో నేను మదరాసు మెయిలు ఎక్కుతున్నాను – ప్రధానంగా ఒక పరస్త్రీని చూడడానికి!

రైలు పెట్టెలో ఒక మూల స్థిమితంగా కూర్చున్నమీదట రాజమండ్రిలో మాలతితో నేను ప్రేమకలాపం సాగించిన కాలేజీ రోజులు నెమరు వేసుకున్నాను. నేను ఇంటరు జూనియరు చదువుతున్న రోజు లవి. అప్పుడే మాలతి మీదికి నా మనసు మళ్ళింది. ఫలానా అంశం నన్ను ఆకర్షించిన దని చెప్పి లాభంలేదు. కాని ఒకటి మాత్రం సత్యం. ఆమె అంగసౌష్టవం నా హృదయాన్ని వశపరచుకున్నది. నాకు తెలియకుండానే యీ ఆకర్షణ ప్రేమగా మారినట్లుంది. ఆమెతో స్నేహం చేశాను. పుస్తకాలను ఇచ్చి పుచ్చుకోవడాలలో ఆమె చేతి మునివ్రేళ్ళను తాకడానికి ప్రయత్నించి ధన్యుడ నయ్యాను. ఆమె కరస్పర్శవల్ల అనిర్వచనీయమైన సుఖానుభూతి పొందేవాడిని. ఆ సుఖం ఎప్పుడూ మరువలేను. ఆమె కూడా అదే విధముగా తన్మయత్వం చెందినదో లేదో చెప్పలేను. అట్లాంటి చిహ్నాలేవీ ఆమె ముఖంమీద కనపడలేదు.

బి. ఏ. పరీక్ష లయాయి. పరీక్షల చివర రోజున మాలతిని ఒక సినీమాకు తీసుకొని వెళ్ళాను. హాలులో కూర్చున్నా నన్నమాటేగాని నడుస్తున్న చిత్రం వైపు చూడనేలేదు. ఆటవుతున్నంత సేపూ మాలతి ప్రక్కనే కూర్చుని ఆమె సౌందర్య సుధను ఆస్వాదిస్తున్నాను, కండ్లతోనే. పాపం, ఆమె తదేకధ్యానంతో తెరమీద బొమ్మలను చూస్తూ కూర్చుంది. జారిన పైటనైనా గమనించకుండా ఆటలో లీనమైపోయింది. ఇంతలో 'విశ్రాంతి' నిమిత్తం దీపాలు వెలిగాయి.

"చివరికి హీరో గతి ఏమవుతుందం టావు, శంకరం?" అంది మాలతి.

"చూస్తాంగా" అన్నాను.

"ఈ సినీమా కథంతా ఏదో నవలలో చదివినట్టు జ్ఞాపకం"

"బహుశా చదివే ఉంటావు.' అన్నాను పరధ్యానంగా.

"ఆ విలన్ నటన బొత్తిగా... ఏమోయ్ శంకరం వింటున్నావా లేదా?'

అన్నది మాలతి నా పరధ్యానాన్ని పసిగట్టి.

"లేదు – అవునవును" అని నసిగాను.

"ఏదేం శంకరం, ఇవ్వాళ ఏదోలా గున్నావు ?"

"మాలతీ, చాలానాళ్ళనుంచీ నీతో ఒక ముఖ్యమైన సంగతి చెబుదా మను కుంటున్నాను" అని కొంత సేపాగాను.

"ఊరుకున్నా వేం ? కాని య్యి శంకరం!"

"ఇక్కడ కాదు, మాలతీ. మళ్ళీ ఆట మొదలుపెడితే మన మాటలవల్ల ప్రక్క నున్నవాళ్ళకు యిబ్బంది కలుగు తుంది."

"అయితే అట్లా పార్కులోకి పోదాం పద" అంది మాలతి.

ప్రక్కనున్న పార్కులో కూర్చున్న తరువాత మాలతిమీద నాకున్న మధుర ప్రేమను తెలియ జేద్దా మనుకున్నాను. కాని నానోట మాట పెగలలేదు. మూగ వానిలా ఆమెప్రక్కన కూర్చున్నాను.

"చెప్పు శంకరం" అని ఆమే కదిలించింది.

కృత్యాద్యవస్థలో పడ్డాను. కొంచెం దగ్గి, గొంతుక సవరించుకుని ఇలా అన్నాను; "మా అమ్మా నాన్నా నాపెళ్ళి విషయం చాలా తొందర చేస్తున్నారు, మాలతీ."

"అయితే అభ్యంతరం పెట్టకు" అన్నది మాలతి నవ్వుతూ.

"కొన్నాళ్ళు అసలే పెళ్ళి వద్దన్నాను. వాళ్ళు పోరుపెడితే బి. ఎ. పాసయాక ఆలోచిద్దాం అన్నాను."

"చూడు శంకరం. నీకు పెళ్ళి అసలే యిష్టం లేకపోతే పరీక్ష పోవాలని ప్రార్థించు...'' అన్నది హాస్యధోరణిలో.

"ఇష్టం లేక కాదు."

"ఇకనేం. ఆ సంగతి మీఅమ్మగారితో చెప్పెయ్."

"నీకు హాస్యంగానే ఉంటుంది కాని అసలువిషయం విను. నేను ఏ అమ్మాయి నాన్నగారినైనా కలుసుకోమంటే కలుసుకోడానికి సిద్ధంగా ఉన్నారు మా నాన్నగారు."

"ఇకనేం? చెప్పు."

''మీ నాన్నగారిని కలుసుకొమ్మని చెప్పనా, మాలతీ?'' అని అత్రుతగా అడిగాను.

''ఇక దొంకతిరుగుడు చాలించు శంకరం. మా నాన్నగార్ని ఎందుకు కలుసుకోవాలి'' అన్నది కొంచెం తీవ్రంగా.

"నేను నిన్ను ప్రేమిస్తున్నాను కనుక. నన్ను కాదనకు, మాలతీ. నిన్ను సుఖపెట్టడమే నా జీవితలక్ష్యం. నువ్వు అవునంటే తక్కిన ఏర్పాట్లన్నీ చేయిస్తాను.''

''క్షమించు శంకరం. నేను నిన్ను ప్రేమించడంలేదు. అంటే పెండ్లికి సంబంధించిన అర్థంలో. నా అభిప్రాయం నీకు అర్థమయిం దనుకుంటాను.''

అంత తేలికగా విడిచిపెట్టేఘటాన్ని కాదు నేను. కాబట్టిఆమెను బ్రతిమాలుతూ అడిగాను, "పోనీ మాలతీ. నిన్ను నేను పెళ్ళి చేసుకున్న తరువాత ప్రేమించడానికి ప్రయత్నించుదువు గానిలే.''

''నీ దొంకచాదస్తపు ధోరణి, శంకరం" అంది మాలతి తేలికగా.

''ప్రతి ప్రేమికుని ధోరణీ అంతే కదా!''

''నీ ధోరణే నీది కాని నేను వేరొకరిని ప్రేమించి ఉండవచ్చుననే ఊహే నీకు తట్టదేం?''

"అట్లాగా? ఎవ రాఅదృష్టవంతుడు?''

"అతనిపేరుమల్లికార్జునరావు. మనం ఇంటరు జూనియరు చదువుతున్నప్పుడు అతడు ఫైనలియరులో ఉండేవాడు. మే మిద్దరం ఒకరి నొకరం ప్రేమించుకున్నాము. మా ఇద్దరి తలిదండ్రులూ మా పెండ్లికి సమ్మతించారు. అయితే ఉద్యోగం అయితేగాని చేసుకోనని ఆయనా, నా చదువు పూర్తయితేగాని చేసుకో నని నేనూ భీష్మించుకున్నాము. క్రిందటి సంవత్సరం ఆయనకు ఉద్యోగం దొరికింది. ఇప్పుడు నా చదువు పూర్త యింది. ఇక ఆటంకాలన్నీ తీరాయి కనుక యీ వేసంగిలో నా పెళ్ళి జరుగుతుంది అనుకుంటా. నిన్ను పిలవకుండా పెళ్ళి చేసుకోనులే."

ఇంక మాట్లాడ్డానికి ఏమీ లేక సినీమా హాలులోకి పోయి మా సీట్లలో కూర్చున్నాం. ఆటయిన తరువాత ఆమె యింటివరకూ దిగబెట్టాను.

''గుడ్‌నైట్ శంకరం" అందిమాలతి.

"గుడ్‌బై, మాలతీ" అన్నాను దిగులుగా.

ఇంక మాలతిని చూడకూడదని నిశ్చయించుకున్నాను. చూచినకొద్దీ ప్రేమ గాఢమైపోతుందేమో నని సాభయం. ఆమెను మరచిపోదామని విశ్వ ప్రయత్నం చేశాను. కాని మరువలేక పోయాను. అనేక ఊళ్ళల్లో ఉన్న బంధువులను చూడాలనే మిషమీద కొన్నాళ్ళు తిరిగాను.

ప్రయాణం చేస్తూ ఉంటే మాలతిపై నా కున్న గాఢవాంఛ సమసిపోతుం దని భ్రమించాను. కాని ఆమె చక్కని ముఖం, కోమలమైన సౌందర్యం నా స్మృతిపథాన ముద్రితమైన విషయం మరచాను. రాజమండ్రికి తిరిగి వచ్చాక మాలతి ఇంటికి పరుగెత్తాను. గేటుకి వేసిన తాళంకప్ప నన్ను వెక్కిరించింది. నిరాశతో మొగం వేలవేశాను. పొరుగు వారి నడిగితే మాలతి తండ్రిగారికి బదిలీ అయినట్లు భోగట్టా తెలిసింది.

ఒక వారం రోజులు గడచాయి.

మాలతీ మల్లికార్జునరావుల వివాహం తెనాలిలో జరుగుతుం దనీ నన్ను రమ్మనీ ఆహ్వానం వచ్చింది. ఆ పెళ్ళికి నేను వెళ్ళలేదు.

ఈలోగా నా బి. ఏ. పరీక్షా ఫలితాలు వచ్చాయి. నేను ప్రథమ శ్రేణిలో పాసయ్యాను. నెల రోజుల తరువాత శకుంతలతో నా పెండ్లి నిశ్చయమయింది.

"నువ్వు చాలా అదృష్టవంతుడవోయ్, శంకరం" అన్నాడు భూపతి వాడు ఇంటరులో నా సహపాఠి కాని తరచు పరీక్ష తప్పినందువల్ల ఇంకా కళాశాలలోనే చదువుతున్నాడు వాడు చాలా హుషారైన మనిషి. అందరికీ వాడంటే యిష్టం. వాడు ఒక్కొక్కప్పుడు ప్రమాదంలేని బాతాఖానీ వేస్తూఉంటాడు గౌతమీ గ్రంథాలయంలో వాడు తారసిల్లాడు.

"నువ్వు చాలా అదృష్టవంతుడవోయ్" అన్నాడు భూపతి పునరుక్తి దోషాన్ని పాటించకుండా.

"కొంచెం విడమరచి చెప్పవయ్యా" అన్నాను.

"శకుంతలను పెళ్ళాడడం అదృష్టమే. ఆమె ఆణిముత్యం లాంటిది నీకు జ్ఞాపకం ఉందా, మనం స్కూలు ఫైనలు చదువుతూన్నప్పుడు ఆమె మన సహాధ్యాయిని. తరువాత చదువు మానేసింది. ఆమె మా వీధిలోనే ఉండేది ఆమే, మా చెల్లెలూ స్నేహితురాళ్ళు ఆమె గురించి మా చెల్లి ఏం చెప్పిందంటే – నేను చెప్ప నబ్బాయ్."

సస్పెన్సుకోసం అతడు వేసే వేషాలకు నాకు వళ్ళు మండింది.

"చెప్పకపోతే దాచుకో" అన్నాను చిరాకుగా.

"బలేవాడివయ్యా నువ్వు! కాబోయే భార్య గురించి కబుర్లు వినడానికి ఎవరికి ఆతృత ఉండదు? చెప్పినందుకు నాకు బహుమతి ఇవ్వాలి.''

"అబ్బ. చంపక అసలు సంగతి చెబుదూ."

"అసలు సంగతి ఏమంటే నిన్ను శకుంతల ప్రేమిస్తున్నది. నిన్ను స్కూల్ ఫైనలు క్లాసులో చూసింది మొదలు నిన్ను ప్రేమించింది. ఆమె చదువు కొనసాగించాలనే ప్రయత్నించింది; కాని ఆమె వరుసగా స్కూలు ఫైనలు తప్పడం వల్ల యింక చదువు చాలించుకోవలసి వచ్చింది. ఆమె పరీక్షలు తప్పడానికి కారణం తెలుసునా? నువ్వే.

''నేనా? ఏమిటి నీ ఉద్దేశ్యం?"

''అవును, నువ్వే. నిరంతరం నీ గురించే తలపోస్తూ ఉండడంవల్ల చదువు మీద దృష్టి కుదరలేదు. వచ్చిన సంబంధాలను వద్దంటూ నిన్నే పెండ్లాడతా నని పట్టుపట్టుకూర్చుంది. మీ నాన్నగారితో ఆమె నాన్నగారు మాట్లాడి, నీ చదువు పూర్తయేవరకు ఆగి...''

"ఆపవయ్యా భూపతీ. ఇదేదో సరుకుల వ్యాపారంలా మాట్లాడతావేం? నేను ఒప్పుకోవలసిన అవసరం లేనట్టు చెప్పుకుపోతావేం?"

''నీ ఒప్పుదలా? నువ్వు ఎట్లానూ అంగీకరిస్తావు.''

''నీ కెట్లా తెలుసు?''

"శకుంతల లాంటి పుత్తడిబొమ్మను ఒల్లనివాడు వట్టి మూర్ఖుడై ఉండాలి. మరి నువ్వు మూర్ఖుడవు కావుకదా."

భూపతి చెప్పింది నిజం. నేను చూచిన సౌందర్యవతులలో శకుంతల ఒకర్తె. మాలతిని నేను ప్రేమించి ఉండకపోతే భూపతి చెప్పిన దానితో పూర్తిగా ఏకీభవించి ఉందును. ఆమె మాలతికంటే కూడా ఎక్కువ అందగత్తె కావచ్చు. అయినా శ్రీనాధుడన్నట్లు 'దప్పి కొన్నట్టివాని కా దప్పి దీర్ప, సలిల పూరంబుహితవొ, యాజ్యంబుహితవొ?' నా దాహానికి కావలసిన నీరు లభించ లేదు. మామూలు దాహతీవ్రత వల్ల ప్రాణం పోయి సమస్యా పరిష్కారం కావచ్చు. కాని యీ నాతృష్ణ నన్ను కల్లోల పరుస్తోంది.

ఏమయినా ఒక అమ్మాయి నన్ను ప్రేమించి పెళ్ళి చేసుకుంటోం దని విన్నప్పుడు నాకు గర్వకారణమే అయింది.

శకుంతలకు సంపూర్ణసౌఖ్యం యివ్వాలనే ప్రయత్నించాను. కాని మాలతిపై నా కున్నపిచ్చి తరచు నన్ను వేధిస్తోంది. ఎవరికీ తెలియకుండా నాలో నేనే కుమిలిపోయే పిచ్చి అది!

ఎంతో ఆశతో సెంట్రలు స్టేషను చేరాను. మొట్టమొదట హెడ్డాఫీసులో కంపెనీపని పూర్తిచేసుకుని ఆ తరువాత మాలతి ఆచూకీ కనిపెట్టడానికి మదరా సంతా గాలించా లని నిశ్చయించాను.



"ఏవిటి వాళ్ళిద్దరికీ ఉద్యోగం ఒక ఆఫీసులోనేనా ?
"అదే అనుకోవాలి. భార్యను పొద్దున ఆఫీసుకి పంపించి సాయింత్రం తీసుకొస్తాడు "

అప్పుడు నాకు తట్టింది నేను చేయబోయే పని ఎంత తెలివి మాలినదో. వీధి పేరు గాని ఇంటి నంబరుగాని తెలియకుండా మదరాసువంటి మహానగరంలో వెతక పూనడం గడ్డిమేటిలో సూదిని వెతికి నట్లుంటుంది. కాని మాలతి మదరాసులో ఉందని రూఢిగా తెలుసును కనుక ఆమెను వెతకడంకోసం ఎంతకష్టపడినా కష్టపడాల్సిందే. నష్టం లేదనుకున్నాను.

హెడ్డాఫీసుకి వెళ్ళాను. నా కళ్ళను నేనే నమ్మలేకపోయాను. అక్కడ భూపతిని చూచి. వాడుకూడా నన్ను గుర్తించాడు.

"అరే ! నువ్వుటయ్యా, శంకరం'' అన్నాడు.

''ఇక్కడికెల్లా వచ్చావయ్యా, భూపతీ ?''

"ఉన్నమాట చెప్పాలంటే దానికి కారణం బంధుప్రీతి అనాలి. మా నాన్నగారు ఈ కంపెనీ డైరెక్టర్లలో ఒకరికి మా చెల్లెలినిచ్చి పెండ్లిచేశారు. తరువాత మా బావగారు నా నిరుద్యోగ సమస్యను పరిష్కరించారు. ఇదే కంపెనీలో నువ్వు కూడా పని చేస్తున్నావని కలలోకూడా అనుకోలేదు. లేకపోతే రెండేళ్ళ క్రితమే నిన్ను పట్టుకునేవాడిని.''

"అదీకాక హెడ్డాఫీసుకి వచ్చే అలవాటు నాకులేదు, ఎవర్నో ఒకరిని పంపేవాడిని" అన్నాను.

"బాగా కలిశాం శంకరం నాకు కొంచెం పనుంది నీ పనికూడా ముగించుకో తాపీగా తరువాత మాట్లాడు కుందాం

జనరలు మేనేజరుతో నా కున్నపని పూర్తిచేసుకున్నాను ఆయన దగ్గరున్న పర్సనల్ శక్రటరీని ఎక్కడో చూచినట్లు అనిపించింది కాని సరిగా గుర్తుకు రాలేదు

ఆ సాయంత్రం భూపతి నన్ను మెరీనా బీచికి తీసుకొని వెళ్ళాడు చాలా విషయాలు మాట్లాడుకున్నాము వా డుంటే కబుర్లకు లోటుండదు యధాలాపంగా 'పెళ్ళయిందా' అని భూపతిని అడిగాను

"ఇంకా నేను నిశ్చయించుకోలేదు. ఏం చెయ్యాలో తోచక తికమక పడుతున్నాను పెళ్ళయిన కొంతమందిని చూస్తుంటే పెళ్ళి చేసుకోవడం తెలివిగల పనేనా అని సందేహం కలుగుతూంది ' అన్నాడు భూపతి

"వివాహం అనే వ్యాపారానికి జమాఖర్చులు బేరీజు వేసుకుంటే చివరకు లాభసాటి వ్యవహారమే నని తేలవచ్చు" అన్నాను కాని నా కున్న సందేహాలు నా కున్నాయి

"కాని నేను చెప్పబోయే దంతా విను జనరలు మేనేజరు దగ్గ రున్న పర్సనల్ శక్రటరీని తెలుసుగా నీకు '

"వ్యక్తిగతంగా నాకు తెలీదు కాని తెలిసిన మొగంలా గుంది ఎక్కడ చూచానో గుర్తుకు రావడంలేదు "

"అతనెవరోకాదు-మల్లికార్జునరావు. మన కాలేజీలో మనకంటె సీనియర్‌గా ఉండేవాడు."

"ఓహో అతనా, మన సహాధ్యాయిని మాలతిని పెళ్ళి చేసుకున్నాడు ఆ మల్లికార్జునరావేనా యితను ?' అని ఆశతో అడిగాను

' అవునవును ఆ మల్లికార్జునరావే "

వెతకబోయిన తీగ కాలికి తగిలినట్లయింది ఆడబోయిన తీర్థం ఎదురయినట్లు అయింది చివరకు మాలతి ఆచూకీ తెలిసింది '

భూపతి చెప్పుకుపోతున్నాడు "ఈ మల్లికార్జునరావున్నాడే చాలపనినేర్పున్నవాడు కాని వా డింటికి వెళ్ళగానే పిల్లిపిల్లలా భార్యకు భయపడతా డని నువ్వూహించనయినా ఊహించగలవా?"

"ఒక్క క్షణంకూడా అలా ఊహించలేను ఎందుకంటే మాలతిలాంటి చదువుకున్న స్త్రీవిషయంలో అది అసంభవం

' నువ్వలాగే అనుకుంటూ కూర్చో మనలో చాలామందితో వచ్చిన చిక్కేమిటంటే మన ఆదర్శాల రంగుటద్దాల కళ్ళజోళ్ళను తీసేసి నిజాన్ని చూడలేము కాని నేను చెప్పే నిజం విను "

' కానియ్యి కానియ్యి

' మా బావగారింట్లో వీధివైపుగదిలో

నా మకాం. ఆయనకీ నగరంలో చాలా పను లున్నాయి. వాటిమీద తిరుగుతూ ఉంటారు. నాకు తీరికగా ఉన్నప్పుడల్లా మా చెల్లెలుతో బాతాఖానీ వేస్తూ ఉంటాను. ఇరుగు పొరుగు కుటుంబాలవారి లోగుట్లు కనిపెట్టడంలో ఆమె నాకు చెల్లెలే. ఒక్కొక్కప్పుడు ఆమెపసికట్టే భోగట్టా షెర్లాకు హోమ్సుని కూడా చకితుణ్ణి చేస్తుంది."

"బాబూ, ఆ ఉపోద్ఘాతం కట్టిపెట్టి అసలు సంగతి చెబుదూ నీకు పుణ్యం ఉంటుంది.''

"వస్తున్నా. మల్లికార్జునరావు మా ప్రక్కసందులోనే కాపుర ముంటున్నాడు. మా చెల్లెలు అప్పుడప్పుడు పొరుగింట్లకు పోతూంటుంది. ఆమె చెప్పిన దానినిబట్టి ముగ్గురు పిల్లలు పుట్టినతరువాత విసుగు, కోపం కలిసిన స్వభావం వచ్చేసింది మాలతిలో. భర్త నెప్పుడూ సాధించుకు తింటుంది. చాల రభస పెడుతుంది. ఈ పెళ్ళి అనేది ఎంతటి సౌందర్య వతుల నైనా ఎట్లా నాశనం చేస్తుందో తలంచుకుంటే నాకు దిగ్భ్రమ కలుగుతోంది. మన కాలేజీ రోజులలో మాలతిని మన మందరం ఎరుగుదుము. ఇప్పుడామెను చూస్తూ ఉంటే బలిసి లావెక్కిన ఆ స్త్రీలో, ఎప్పుడు దెబ్బలాడుతుందో నని భయపెట్టే ఆమె ముఖంలో పాతమాలతి మచ్చుకైనా కనబడదు. ఆమె ఆకర్షణ అంతా—"

"ఆపవయ్యా బాబూ, ఆపు" అని ఎలుగెత్తి కేక వేశాను.

నేను కట్టిన గాలిమేడలు కూలినందుకు విస్తుపోయాను. మాలతి భౌతిక సౌందర్యం మీద పిచ్చి ఆకర్షణలో పడి కాలచక్రం దానిని రూపుమాపడం కూడా సంభవమేనన్న సంగతి మరచిపోయాను.

"ఏమయింది నీకు, శంకరం? మారిన మాలతిని నేను స్వయముగా చూచాను. ఆమె వికృత రూపాన్ని కళ్ళారా చూచాను. ఆమె క్రూరస్వభావం గురించి వీధంతా చెప్పుకుంటారు."

భూపతి నిజం చెబుతున్నాడని పించింది. వాడా విధముగా వర్ణించిన తరువాత మాలతిని చూడడానికి ధైర్యం చాలడం లేదు. స్మృతి పథంలో ఉన్న ఒక్క సౌందర్యమూర్తి కూడా దానితో తుత్తునియలై పోతుందని నా భయం.

అయితే, ఇన్నాళ్ళూ నేను దేనికోసం దేవులాడుతున్నాను?